సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 29 । జనవరి । 2025



రూ.20 లక్షలు కాజేసిన నేరగాళ్లు
ఏలూరు శివారు వట్లూరుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు పోలీసు అధికారులమని బెదిరించి దాదాపు రూ. 20 లక్షలు కాజేశారు. 8లో ▸



పెన్షన్.. టెన్షన్
తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పింఛనుదారుల వెరిఫికేషన్ కష్టాలు కొనసాగుతున్నాయి. గంటల తరబడి వేచి ఉన్నా వారిని పట్టించుకోని పరిస్థితి.. 8లో ▸



చోరీ సొత్తు స్వాధీనం
పశ్చిమ గోదావరి జిల్లాలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసి రూ.13.38 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

పశువధ.. మహిళల కన్నీటి వ్యథ

- తేతలిలో పశువుల వ్యాన్లను అడ్డుకున్న మహిళలను కొట్టిన గూండాలు
- అడ్డొస్తే చంపేస్తామంటూ పోలీసుల ముందే బెదిరింపులు
- మహిళలను కొట్టినా పట్టని పాలకులు
- అధికారులు, పోలీసులు అమ్ముడుపోయారంటూ బాధితుల ఆవేదన



పశువధ కర్మాగారం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న న్యాయవాది రమేష్



తేతలి పశువధ కర్మాగారం వద్ద దాడి జరిగిన ప్రాంతంలో ఉన్న మహిళలు

తణుకు అర్బన్: తమ ప్రాంతంలో పశువధ శాల వద్దన్నందుకు మహిళలపై దాడులకు తెగబడుతున్నారు. పోలీసులు, అధికారులు యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ తేతలి గ్రామస్తులను బెదిరిస్తున్నారు. కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంతో తేతలిలో నిర్వహిస్తున్న ఈ పశువధ వ్యవహారంలో లాహం ఫుడ్స్ ప్రొడక్ట్స్ సంస్థ మేనేజరు గతంలో బెదిరింపు ధోరణితో మాట్లాడారు. దానికి తగ్గట్లు సోమవారం రాత్రి కిరాయి గూండాలతో దాడులు చేయించారు. దుర్వాసన.. అనారోగ్య వాతావరణంలో జీవించలేకపోతున్నామని రోడ్డెక్కిన మహిళలను రోడ్డుపైనే కొట్టించారు. సోమవారం రాత్రి పశువులతో వచ్చిన వ్యాన్‌లను అడ్డుకున్న వ్యవహారంలో మహిళలపై దాడులు చేయడమే కాకుండా అడొస్తే చంపేస్తాం అని పోలీసుల సమక్షంలోనే రెచ్చిపోయారు. ఎక్కడో ఉత్తరప్రదేశ్ నుంచి వ్యాపారం చేసేందుకు వచ్చిన వ్యక్తి కోసం ఆడబిడ్డలను కొట్టించారని తేతలి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి పార్టీలకు మా గోడు పట్టదా!

పశువధ శాలను తొలగించాలని కోరుతూ తేతలి పశువధ శాల బాధిత మహిళలు 40 మంది ఈ నెల 10న మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో జనవాణి కార్యక్రమంలోను, టీడీపీ కార్యాలయంలోను గోడు వెల్లబోసుకుని వినతిపత్రాలు అందచేశారు.. అయినప్పటికీ ఇంతవరకు ఎలాంటి ఆదేశాలు రాకపోగా రాత్రి సమయంలో వ్యాన్‌ల ద్వారా పశువులను తరలిస్తూ కర్మాగారంలో పశువధను తీవ్రం చేశారు. సోమవారం రాత్రి గేదెలతో వచ్చిన 6 వ్యాన్‌లను పశువధ శాల గేటు ముందు అడ్డుకున్నారు. లోపల నుంచి వచ్చిన 10 మంది సిబ్బంది మహిళలను కొట్టారు. బాధిత మహిళలు, గోసేవా సమితి సభ్యులు అడ్డుగా ఉండి వ్యాన్‌లు నిలుపుదల చేశారు. ఇంతలో తణుకు నుంచి వచ్చిన రౌడీ మూకలు దాడిచేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. 100 నంబరుకు రెండు సార్లు ఫోన్ చేయగా వచ్చిన పోలీసులు సంస్థకు అనుకూలంగా మాట్లాడడమే కాకుండా మహిళలపై ఎఫ్ఐఆర్ ఓపెన్ చేస్తామని రూరల్ ఎస్సై చంద్రశేఖర్ బెదిరించారని మహిళలు ఆరోపిస్తున్నారు. డబ్బుకు అమ్ముడుపోయి పాలకులు, అధికారులు పశువధ శాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని.. తమ ఉసురు తగిలి నాశనం అయిపోతారని మహిళలు శాపనార్థాలు పెట్టారు. పశువధకు సహకరించే వారందరూ మూల్యం చెల్లించుకోకతప్పదని, ఆడబిడ్డలను కన్నీళ్లు పెట్టించారని, రోడ్డెక్కించారని, దాడులు కూడా చేయించారని, ఇక మిగిలింది చంపించడమేనని.. చావడానికి కూడా సిద్ధంగానే ఉన్నామని మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చే నెత్తురు డబ్బు కోసం ఎంతకైనా దిగజారే పరిస్థితి తణుకులో తలెత్తడం దారుణమని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కోట్లాది రూపాయిలు డబ్బు అందడం వల్లే మాట్లాడాల్సిన వారు మౌనం వహించారని, పోలీసులు అత్యుత్సాహం చూపిస్తూ బాధితులను భయపెట్టే పరిస్థితికి వచ్చారని వాపోయారు. ఇంత జరిగినా.. మహిళలను తీవ్రంగా కొట్టినా.. పశువధకు వ్యతిరేకం అన్న వ్యక్తులు మౌనం వహించడం దురదృష్టకరమని ఆందోళన చెందుతున్నారు. దాడిపై వల్లూరి గంగాభవాని తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దాడికి మూల్యం చెల్లించక తప్పదు

మహిళలపై దాడికి దిగిన పశువధ శాల యాజమాన్యం వారికి సహకరిస్తున్న పాలకులు, అధికారులు భవిష్యత్తులో తగిన మూల్యాన్ని చెల్లించక తప్పదు. మా ఇళ్లలో మేము ఉండలేకపోతున్నాం అని రోడ్డెక్కిన మహిళలను కొట్టే స్థాయికి దిగజారిపోయారంటే డబ్బు ఎలా అమ్ముడు పోయారో అర్థమవుతోంది. తణుకు ప్రజానీకాన్ని భాగస్వామ్యులను చేస్తూ రాబోయే రోజుల్లో పశువధ శాలను ప్రోత్సహిస్తున్న వారికి కంటి మీద నిద్రలేకుండా చేస్తాం.

– అనుకుల రమేష్, న్యాయవాది, తణుకు

చంపేస్తామని బెదిరించారు



పశువులతో వచ్చిన 6 వ్యాన్‌లను అడ్డుకున్న మమ్మల్ని పశువధ శాల యాజమాన్యం పంపిన గూండాలు ఇష్టానుసారంగా కొట్టారు. గుద్ది బూతులు తిట్టారు. పోలీసుల ఎదురుగానే మమ్మల్ని చంపేస్తామని బెదిరించారు. ఇంత జరుగుతున్నా మాకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు మాపై కేసులు నమోదు చేస్తామని బెదిరించడం ఎంతవరకు సబబు.

– వల్లూరి గంగాభవాని, సజ్జాపురం, తణుకు

యాజమాన్యానికే పోలీసుల మద్దతు



100 నంబరుకు రెండు సార్లు ఫోన్ చేస్తే కానీ పోలీసులు రాలేదు. వచ్చిన తరువాత కూడా ఫ్యాక్టరీకి మద్దతుగా మాపై జులుం ప్రదర్శించారు. రౌడీలను తీసుకువచ్చి మాపై దాడులు చేశారు. మా ఇంట్లో మమ్మల్ని బతికేలా చూడమని వేడుకున్నాం. రోడ్డెక్కాం, కాళ్లు పట్టుకుంటామని అన్నాం. పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరిగాం చివరకు మాపై దాడి చేసి మమ్మల్ని కొట్టే పరిస్థితి వచ్చింది.

– పి.దుర్గాభవాని, మహాలక్ష్మి నగర్, తేతలి

ఆలయ దర్శనంపై వినూత్న రీతిలో సర్వే



శ్రీవారి ఆలయ ఆవరణలో క్యూఆర్ కోడ్



సర్వే పేరుతో ఫోన్‌లో వచ్చే ఫాం

ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలను సందర్శించే భక్తుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు దేవదాయ శాఖ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. అధునాతన పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్యూ ఆర్ కోడ్‌ల ద్వారా భక్తులకు అందుతున్న సౌకర్యాలు, ఇబ్బందులను తెలుసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. సోమవారం రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలోని ప్రొటోకాల్ కార్యాలయం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ తదితర ముఖ్యమైన ప్రదేశాల్లో క్యూఆర్ కోడ్‌లను స్థానిక దేవస్థానం అధికారులు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రధాన దేవాలయాలైన విజయవాడ, అన్నవరం, సింహాచలం, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాల్లో సైతం ఈ క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసి, ఆలయ దర్శనంపై సర్వే నిర్వహిస్తున్నారు.

అభిప్రాయాలు తెలిపేదిలా..

దర్శనానంతరం తమ అభిప్రాయాలను దేవదాయ శాఖకు తెలియజేయాలనుకునే భక్తులు గూగుల్ క్రోమ్ ఓపెన్ చేసి, అందులోని గూగుల్ లెన్స్‌తో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. ఆ తరువాత ఆలయ దర్శనంపై సర్వే.. పేరుతో ఒక ఫాం ఓపెన్ అవుతుంది. అందులో మీ దర్శనం యొక్క అనుభవం ఎలా ఉంది? బాగుందా.. లేదా,... దేవాలయాల్లో మౌలిక వసతులు, తాగునీరు, వాష్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, రవాణా సౌకర్యాలు, చెప్పులు పెట్టే స్థలంపై మీ అభిప్రాయం? బాగుందా, లేదా..., దర్శనం మీరు భావించిన సమయంలో జరిగిందా, లేదాజ.. ప్రసాదం తాజాగా రుచిగా ఉందా, లేదా.. అనే అభిప్రాయాలను తెలిపి, భక్తుడి పూర్తి వివరాలను అందులో తెలియజేసి సబ్మిట్ చేయాలి.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలపై ప్రిన్సిపాల్స్‌కు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్ఐఓ చంద్రశేఖర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఫిబ్రవరి 1 నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఒక రోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం స్థానిక సెయింట్ థెరిస్సా బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు మాట్లాడుతూ వచ్చే ఫిబ్రవరి 1, 3 తేదీల్లో ఇంటర్ క్వాలిఫయింగ్ పరీక్షలైన ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్, ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 5 నుంచి ఒకేషనల్, ప్రయోగ పరీక్షలకు సమాయత్తం కావాలన్నారు. ఈ క్వాలిఫయింగ్ పరీక్షలలో విద్యార్థులు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధిస్తేనే ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్ ఇస్తారని తెలపాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో ఇంటర్మీడియట్ పరీక్షల స్పెషల్ ఆఫీసర్ డీవీఈఓ బి.ప్రభాకర రావు, పరీక్షల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ చదువుతున్న బాలికలకు రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ పేరిట ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకూ శిక్షణ ఇవ్వడానికి ఏజెన్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థల్లో స్వీయ రక్షణ శిక్షణ నిర్వహించడంలో ఏజెన్సీలకు ముందస్తు అనుభవం ఉండాలని, శిక్షకులకు తప్పనిసరిగా కనీసం ఒక మార్షల్ ఆర్ట్ లేదా ఆత్మరక్షణ క్రమశిక్షణలో (తైక్వాండో, కరాటే, జూడో) సర్టిఫికెట్ పొంది ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 30 సాయంత్రం 5 గంటల లోపు ఏలూరులోని జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అందచేయాలని సూచించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

ద్వారకాతిరుమల: సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బు తీసుకుని, ఇద్దరిని మోసగించిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జి.కొత్తపల్లికి చెందిన బిరుదుగడ్డ బజారియ్య 2023 ఆగస్టులో సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్‌లో అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని, రామన్నగూడెంకు చెందిన కుక్కల నాగమల్లేశ్వరరావు, పాల నాగార్జునను నమ్మించి, వారి నుంచి చెరో రెండున్నర లక్షల రూపాయలు తీసుకున్నాడు. వారికి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చాడు. అయితే మోసపోయినట్టు తెలుసుకున్న బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై కేసు నమోదుచేసి, బజారయ్యను అరెస్టు చేశారు. అనంతరం భీమడోలు కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఆయన తెలిపారు.

జేఈఈ పరీక్షకు 195 మంది హాజరు

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాలలో మంగళవారం జరిగిన జేఈఈ మెయిన్స్ సెక్షన్-1 పరీక్షకు 195 మంది హాజరయ్యారు. ఉదయం షిఫ్టులో 100 మందికి 99 మంది హాజరుకాగా, మధ్యాహ్నం 99 మందికి 96 మంది హాజరయ్యారు.

ఫీజుల పేరిట విద్యార్థులకు వేధింపులు



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో నారాయణ, శ్రీ చైతన్య కళాశాలలు విద్యార్థులను ఫీజుల పేరిట వేధింపులకు గురిచేస్తుందని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ పీడీఎస్‌యు ఆధ్వర్యంలో స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి కలెక్టరెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ పరీక్షల నేపథ్యంలో నారాయణ, చైతన్య వంటి కార్పొరేట్ కళాశాలలు ఫీజులు చెల్లించాలని వేధింపులు గురిచేస్తున్నాయని, ఇందువల్ల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా విద్యాసంస్థల తొత్తుగా మారిందని విమర్శించారు.

భుజబలపట్నం హైస్కూల్ పీడీపై విచారణ

పదో తరగతి బాలికను పెళ్లాడతానన్న గొడవపై వివాదం



భుజబలపట్నంలో విచారణ చేస్తున్న డీవైఈవో రవిప్రకాష్, హెచ్ఎం రాజ్యలక్ష్మి, గ్రామ పెద్దలు

కైకలూరు: స్కూల్ పీడీ పదో తరగతి విద్యార్థితో ప్రేమాయణం నడిపి పెళ్లి చేసుకుంటానని అల్లరి చేశాడు. ఈ ఘటనపై మంగళవారం డీవైఈవో విచారణ చేశారు. కైకలూరు మండలం భుజబలపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దాసరి నాగేశ్వరరావు(47)కు వివాహం కాలేదు. సొంతూరు భుజబలపట్నానికే బదిలీల్లో వచ్చాడు. పాఠశాల సమీప గ్రామానికి చెందిన పీడీ సామాజికవర్గానికి చెందిన బాలిక(15) పదో తరగతి చదువుతోంది. తల్లి జీవనోపాధి కోసం దుబాయిలో ఉంటుంది. క్రీడలు నేర్పించే క్రమంలో నాగేశ్వరరావు బాలికతో కొన్ని నెలలుగా పరిచయం పెంచుకున్నాడు. సెల్‌ఫోన్ కొనిచ్చాడు. సంక్రాంతి పండగ రోజుల్లో బాలిక ఇంటికి వెళ్లి తండ్రి, బాలిక నానమ్మతో వివాహం చేసుకుంటానని చెప్పాడు. దీంతో సంక్రాంతి సెలవులు ముగిసిన తర్వాత బాలిక నానమ్మ స్కూల్ హెచ్ఎం రాజ్యలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఆమె విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మకు తెలిపారు. ఆమె ఆదేశాలతో డీవైఈవో రవిప్రకాష్, సిబ్బందితో కలసి విచారణ చేశారు. నాగేశ్వరరావును స్కూల్‌కు పిలిపించారు. బాలికను విచారించారు. సహచర ఉపాధ్యాయులు, బాలిక, పీడీ, పదో తరగతి క్లాసుల విద్యార్థుల నుంచి లిఖిత పూర్వకంగా నివేదిక తీసుకున్నారు. జిల్లా అధికారులకు నివేదిస్తామని డీవైఈవో రవిప్రకాష్ చెప్పారు. పీడీ నాగేశ్వరరావు మండవల్లి హైస్కూల్‌లో పనిచేసినప్పుడు ఇలాంటి వివాదాలనే ఎదుర్కొన్నాడు. అక్కడ నుంచి పనిష్మెంటుగా చినగొల్లపాలెం వెళ్ళాడు. విద్యార్థులను ఆటల పోటీలకు పీడీతో పంపించాలంటే బయపడే పరిస్థితి వచ్చింది. స్కూలు పరువు పోతుందని గ్రామంలో కొందరు పెద్దలు రాజీయత్నాలకు ప్రయత్నించారు.

టౌన్ ప్లానింగ్ ఉద్యోగి అక్రమాలపై ఆరా

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో అక్రమ కట్టడాల వ్యవహారంలో మున్సిపల్ ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. ఆర్‌జేడీ కార్యాలయం నుంచి వచ్చిన అధికారుల బృందం మంగళవారం నగరంలో తనిఖీలు నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న ఉద్యోగిపై పలు ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. బీ-ఫాం పట్టాలు ఉన్న స్థలాల్లో కూడా పక్కా భవనాలు కట్టుకునేందుకు అనుమతులు ఇవ్వడం, ఏలూరు కోర్టు సెంటర్‌లోని కొన్ని దుకాణాలకు అనుమతులు ఇవ్వడం, అశోక్ నగర్‌లోని కొన్ని కట్టడాలు, వన్ టౌన్ ప్రాంతంలోని కొన్ని భవనాలను అధికారులు తనిఖీ చేశారు. బి.ఫారం పట్టాలు ఉన్న స్థలాల్లో కూడా పక్కా భవనాలు కట్టుకునేందుకు అనుమతులు ఎలా ఇచ్చారంటూ అధికారులు సంబంధిత ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తనిఖీల్లో పలు అవకతవకలు బయటపడినట్లు తెలిసింది. కొంత మంది ఉద్యోగులు ఈ విధంగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

ఆ పనులు ఆగేనా.. సాగేనా?

- గత ప్రభుత్వంలో రోడ్లు, బంగ్లాల అభివృద్ధికి రూ.63 కోట్ల మంజూరు
- పనులు మొదలు కాలేదన్న సాకుతో రద్దుకు యత్నం
- ఆ పనులు పూర్తిచేయాలని కూటమి నేతల పట్టు

సాక్షి, భీమవరం: జిల్లాలో రూ.68 కోట్ల వ్యయంతో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరు చేసిన ఆరు ప్రజోపయోగ పనుల రద్దుకు యత్నించిన కూటమి ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఈ పనులు రద్దయితే ప్రజల నుంచి వ్యతిరేకతతో పాటు మళ్లీ మంజూరు కష్టమన్న యోచనలో కూటమి నేతలున్నారు. పనులు ఆపొద్దనే ఒత్తిడితో రద్దు ఆదేశాలను ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు తెలిసింది.

రద్దు ఆదేశాలు నిలుపుదల : పనులు ఇంకా మొదలుకాలేదన్న నెపంతో గత ప్రభుత్వం ఇచ్చిన మంజూరులను రద్దు చేసే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది. ఇటీవల ఆ ఆరు పనులను రద్దు చేస్తూ ఆదేశాలిచ్చింది. ఆయా నియోజకవర్గాల నేతలు ఈ వర్క్‌ల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలుస్తోంది. ఇప్పుడు రద్దు చేస్తే ఆ పనులకు మళ్లీ అంచనాలు రూపొందించి, ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపితే సాంకేతిక, పాలన అనుమతులు వచ్చి, టెండర్ ప్రక్రియ మొదలయ్యేసరికి ఏళ్ల గడిచిపోతాయని, ఈలోగా ప్రజల నుంచి వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందన్న భావనలో నేతలు ఉన్నట్టు సమాచారం. పనులు రద్దు చేయకుండా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఒత్తిడి తీసుకురావడంతో రద్దు ఆదేశాలను నిలుపు చేస్తూ ప్రభుత్వం తాత్కాలిక ఆదేశాలిచ్చినట్టు సమాచారం.

అప్రోచ్ రోడ్డులకు రూ. 36.71 కోట్లు

డెల్టా ఆధునీకరణలో భాగంగా 2008లో భీమవరం నియోజకవర్గంలోని యనమదుర్రు డ్రెయిన్‌పై పలు వంతెనల నిర్మాణానికి దివంగత వైఎస్ దాదాపు రూ.110 కోట్లు మంజూరు చేశారు. గొల్లవానితిప్ప, దొంగపిండి, పట్టణంలో రెస్ట్ హౌస్ రోడ్డు వద్ద వంతెనలు నిర్మించినా అప్రోచ్ రోడ్డులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత ప్రభుత్వంలో స్థానిక నాయకులు నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్య తీసుకెళ్లగా ఆయన స్పందించి రోడ్డుల నిర్మాణానికి రూ. 36.71 కోట్లు మంజూరు చేశారు. వీటిలో కాళీపట్నం- భీమవరం వంతెన వద్ద రూ.9.22 కోట్లు, భీమవరం- దొంగపిండి వంతెన వద్ద రూ.16.58 కోట్లు, దెయ్యాలతిప్ప-నాగిడిపాలెం వంతెన వద్ద రూ.10.91 కోట్లు మంజూరై టెండర్ ప్రక్రియ ప్రారంభం కాగా ఎన్నికలు రావడంతో బ్రేక్ పడింది.



గొల్లవానితిప్ప వద్ద యనమదుర్రు డ్రెయిన్ వంతెనపై ప్రమాదభరితంగా అప్రోచ్ రోడ్డు

చినమిల్లిపాడు-ఆకివీడు రోడ్డుకు రూ.25 కోట్లు



చినమిల్లిపాడు- ఆకివీడు రోడ్డు

ఉండి నియోజకవర్గంలోని చినమిల్లిపాడు, సిద్దాపురం, రాజులపేట, రాజుల కొట్టాడ, ధర్మాపుర అగ్రహారం, నల్లమిల్లిపాడు గ్రామాలు, కొల్లేరు తీర ప్రాంత ప్రజలు, రైతులకు చినమిల్లిపాడు-ఆకివీడు ప్రధాన రహదారిగా ఉంది. రోడ్డు ప్రమాదభరితంగా తయారైంది. రోడ్డు కోసం గత ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది.

బంగ్లాల ఆధునీకరణకు రూ.1.57 కోట్లు



నెగ్గిపూడిలోని బంగ్లా

ఆచంట నియోజకవర్గం నెగ్గిపూడి, నియోజకవర్గ కేంద్రమైన తాడేపల్లిగూడెంలో ఆర్అండ్‌బీ ఇన్‌స్పెక్షన్ బంగ్లాలు ఉన్నాయి. ప్రభుత్వ అవసరాలకు వీటిని వినియోగిస్తున్నారు. వీటి ఆధునీకరణ నిమిత్తం నెగ్గిపూడి బంగ్లాకు రూ.78 లక్షలు, తాడేపల్లిగూడెం బంగ్లాకు రూ.79 లక్షలు గత ప్రభుత్వం మంజూరు చేసింది.

పసిడి ధర పైపైకి..

- 10 గ్రాములు రూ.83 వేలు దాటిన వైనం
- జిల్లాలో తగ్గిన అమ్మకాలు
- రూ.లక్షకు చేరువలో వెండి ధర
- పాత బంగారం మార్పిడికే మొగ్గు



నరసాపురం: పసిడి ధరలు మిడిసిపడుతున్నాయి. బంగారం ధర ఆల్‌టైమ్ హై నమోదు చేసుకుంది. 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.83,300లకు చేరింది. చైనా భారీగా బంగారం కొనుగోలు చేయడం, అమెరికాలో ప్రభుత్వ మార్పు, డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం ధరల పెరుగుదలకు కారణంగా చెబుతున్నారు. అలాగే కొన్నిరోజులుగా స్టాక్ మార్కెట్‌లో ఒడిదుడుకులతో మదుపరులు సురక్షితమైన పెట్టుబడిగా బంగారం వైపు చూస్తున్నారు. మరో వైపు వెండి ధర కూడా పెరుగుతోంది. ప్రస్తుతం వెండి కిలో రూ.96,400 చేరింది. ముంబై మార్కెట్ ధరలను పోలి నరసాపురం బులియన్ వ్యాపారం జరుగుతుంది. సోమవారం నరసాపురం మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.83,300, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములు రూ.76,250గా ఉంది. 916 కేడీఎం ఆభరణాల బంగారం కాసు ధర రూ.61,000లు పలికింది.

పెళ్లిళ్ల సీజన్.. కనిపించని ప్రభావం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పండుగల సీజన్‌లో బంగారం వ్యాపారం సాధారణ స్థాయిలోనే జరిగింది. మరో వైపు పెళ్లిళ్ల సీజన్ మొదలయ్యింది. పసిడి ధరల పెరుగుదల అమ్మకాలపై ప్రభావం చూపింది. పెళ్లిళ్ల సీజన్‌లోనూ జ్యూయలరీ దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఒక్క నరసాపురం మార్కెట్‌లోనే హోల్‌సేల్, రిటైల్ కలిపి రోజుకు రూ.3 కోట్ల వరకూ బంగారం అమ్మకాలు జరుగుతాయి. ఉమ్మడి జిల్లాలోని ఏలూరు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం పట్టణాల్లో పెద్దెత్తున అమ్మకాలు జరుగుతాయి. ప్రస్తుతం జిల్లాలో రోజుకు రూ.2 కోట్ల వరకూ అమ్మకాలు తగ్గినట్టుగా అంచనా. దాదాపు 30 శాతం అమ్మకాలు పడిపోయాయి.

రికార్డు స్థాయిలో పాత బంగారం మార్పిడి

ధరల పెరుగుదలతో ఆభరణాల అమ్మకాలు బాగా తగ్గాయి. పెట్టుబడిగా బిస్కెట్ బంగారం అమ్మకాలు ఓ మాదిరిగా సాగుతున్నాయి. ఇక పాత బంగారం మార్పిడి జోష్ అన్ని పట్టణాల్లో రికార్డు స్థాయిలో కనిపిస్తోంది. ధర ఆల్‌టైమ్ హైకు చేరడంతో పాత బంగారం మార్పిడికి ఇదే సమయంగా కొనుగోలుదారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అమ్మకాల్లో 50 శాతం పాత బంగారం మార్పిడితోనే జరుగుతుంది.

మరింత పెరిగే అవకాశం



బంగారం ధరలు పెరిగే అవకాశం ఉంది. తగ్గే దారి కనిపించడం లేదు. ధరలను అంచనా వేయలేకపోతున్నాం. ప్రస్తుతం 30 శాతం మేర అమ్మకాలు తగ్గాయి. నగదుతో ఎవరూ బంగారం కొనుగోలు చేయడం లేదు. పాత బంగారం మార్చుకుని కొత్త వస్తువులకు ఆర్డర్లు ఇస్తున్నారు.

– అజిత్‌కుమార్ జైన్, బులియన్ వ్యాపారి, నరసాపురం

క్లుప్తంగా

అంగన్‌వాడీ వర్కర్ గౌరీ పార్వతికి పురస్కారం


జాతీయ స్థాయి అవార్డు అందుకున్న గౌరీ పార్వతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉత్తమ అంగన్‌వాడీ వర్కర్‌గా పట్టణంలోని 17వ వార్డు అంగన్‌వాడీ వర్కర్ గౌరీ పార్వతి జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. 13 మంది ప్రపోజల్స్‌లో ఐదుగురిని సెలెక్ట్ చేయగా జిల్లా నుంచి ఐసీడీఎస్ తాడేపల్లిగూడెం సెక్టార్ 1కు చెందిన 17వ వార్డు టీచర్ గౌరీ పార్వతి ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. న్యూఢిల్లీలో మహిళా శిశు సంక్షేమ శాఖ కేంద్ర మంత్రి చేతులమీదుగా గౌరీ పార్వతి జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు సీడీపీఓ టీఎల్ సరస్వతి, సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ దుర్గా భవాని, ఆఫీస్ స్టాఫ్, అంగన్‌వాడీలు అభినందనలు తెలిపారు.

అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్

విశాఖ స్పోర్ట్స్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న 27వ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 720 మంది బాలురు, 510 మంది బాలికలు అథ్లెటిక్స్‌తో పాటు ఆరు క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. ఈపోటీలో 138 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రాంతీయ జట్లుగా తలపడనున్నారు. ఆయా జట్ల సభ్యుల నుంచి అతిథులు గౌరవవందనాన్ని స్వీకరించారు. పశ్చిమగోదావరి జట్టుకు అవినాష్ కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించారు.

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య


కౌలు రైతు చల్లాది ఈశ్వరరావు మృతదేహం

అత్తిలి: అప్పుల బాధ తట్టుకోలేక పురుగుల మందు తాగి కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పి ప్రేమరాజు తెలిపిన వివరాలివి. అత్తిలి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన చల్లాది ఈశ్వరరావు(43) గత కొంతకాలంగా కంచుమర్రు గ్రామంలో నివసిస్తూ కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయంలో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఈనెల 27వ తేదీన ఈర్లకోడుపుంతలో పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఈశ్వరరావును స్థానిక రైతులు కుటుంబ సభ్యులు 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈశ్వరరావు మంగళవారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, ఈశ్వరరావు భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు చెప్పారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పెన్షన్.. టెన్షన్

- లబ్ధిదారుల్లో వెరిఫికేషన్ గుబులు
- ఉంచుతారో.. ఊడగొడతారోనని భయం
- పింఛను మొత్తాన్ని పెంచిన ఆనందం లేకుండా చేస్తున్న కూటమి ప్రభుత్వం
- వెరిఫికేషన్‌కు విశాఖపట్టణం పంపిస్తున్నారంటూ దివ్యాంగుల ఆవేదన


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పింఛను వెరిఫికేషన్‌కు ఇబ్బందులు పడుతూ వస్తున్న దివ్యాంగురాలు (ఫైల్)


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వెరిఫికేషన్‌కు వచ్చిన పింఛనుదారులు

తణుకు అర్బన్ : అక్రమ మార్గంలో పింఛన్లు తీసుకుంటున్నారనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న పింఛను వెరిఫికేషన్ కార్యక్రమం పెన్షన్‌దారుల్లో టెన్షన్ సృష్టిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా 30 సంవత్సరాల నుంచి పింఛను తీసుకుంటున్న లబ్ధిదారులను సైతం వెరిఫికేషన్‌కు పిలవడం లబ్ధిదారులకు ఆగ్రహాన్ని సైతం తెప్పిస్తోంది. పింఛన్ల సంఖ్యను కోత వేసేందుకే కూటమి ప్రభుత్వం ఈ కుట్రలకు తెరతీసిందని దివ్యాంగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.15 వేలు పింఛను తీసుకుంటూ మంచానికి పరిమితమైన వారితోపాటు రూ.6 వేలు పింఛను తీసుకుంటున్న దివ్యాంగులు అంతా కలసి మొత్తం పశ్చిమ గోదావరి జిల్లాలో 27,599 మంది ఉండగా, ఏలూరు జిల్లాలో 33780 ఉన్నారు. వారందరికీ నేడు అన్ని ప్రాంతాల్లోను విభాగాల వారీగా పింఛను వెరిఫికేషన్ చేస్తున్నారు.

దివ్యాంగుల పెన్షన్ల వెరిఫికేషన్

రూ.15 వేల పింఛనుకు సంబంధించి మంచానికి పరిమితమైన దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి వైద్యాధికారులు, ప్రభుత్వ శాఖల అధికారులు పింఛను సక్రమమేనా అని విచారణ చేస్తుండగా, మరోవైపు రూ.6 వేలు పింఛను తీసుకుంటున్న దివ్యాంగులకు నియోజకవర్గాల హెడ్ క్వార్టర్స్‌లోని ఆస్పత్రులకు రప్పించి వెరిఫికేషన్ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 20వ తేదీ నుంచి నియోజకవర్గాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పింఛను వెరిఫికేషన్ శిబిరాలు నిర్వహించారు. ఈ ప్రక్రియలో భాగంగా కంటి, చెవికి సంబంధించిన విభాగాల్లో వెరిఫికేషన్ నిర్వహించగా వచ్చే 5 నెలల కాలంలో దివ్యాంగులకు సంబంధించి అన్ని విభాగాల్లోను ఆయా ఆస్పత్రుల్లో వైద్యులు వెరిఫికేషన్ చేసేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేసింది.

నియోజకవర్గాల వారీగా దివ్యాంగ పింఛన్ల సంఖ్య ఇలా..

భీమవరం	3,480
తాడేపల్లిగూడెం	4,113
తణుకు	4,484
ఉండి	3,805
నరసాపురం	3,131
పాలకొల్లు	4,232
ఆచంట	4,354

జిల్లా నుంచి వచ్చిన దివ్యాంగులు...

గత వారంలో కేవలం తణుకు పట్టణం నుంచి మాత్రమే వెరిషికేషన్‌కు పింఛనుదారులు రాగా నేడు మాత్రం జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులను తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని వెరిఫికేషన్ శిబిరానికి నోటీసులు ఇచ్చి రప్పించారు. దీంతో ఉదయాన్నే భీమవరం, పాలకొల్లు, దొడ్డిపట్ల, ఉండి, కాళ్ల, నరసాపురం తదితర ప్రాంతాల నుంచి దివ్యాంగులు పింఛను వెరిఫికేషన్ కోసం తణుకు ఆస్పత్రికి పడుతూలేస్తూ వచ్చారు. తీరా వచ్చిన తరువాత శిబిరంలో సమాధానం చెప్పేవారు లేక ఇబ్బందులుపడ్డారు. పైగా వచ్చిన వారికి ఎటువంటి భోజన సౌకర్యాలు కల్పించకపోగా కనీసం కాలకృత్యాలు తీర్చుకునే సౌకర్యాలు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా శిబిరాలకు వచ్చిన వారికి అక్కడే భోజన సదుపాయం కూడా కల్పించిన ఘనత జగన్ ప్రభుత్వం తీసుకుందని దివ్యాంగులు చర్చించుకుంటున్నారు.

పెంచడమెందుకు.. కోతలెందుకు..

ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ప్రకారం ప్రభుత్వం దివ్యాంగుల పింఛనును రూ.4 వేలు నుంచి రూ.6 వేలుకు పెంచగా, మంచానికి పరిమితమైన దివ్యాంగులకు రూ.15 వేలు పింఛను ఇస్తున్నారు. అయితే ప్రభుత్వం వచ్చి 7 నెలలు గడిచిందోలేదో అప్పుడే పింఛన్లు పంపిణీ భారంగా భావించి కోతలు కోసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని దివ్యాంగులు విమర్శిస్తున్నారు. మా జగనే ఉంటే మాకు ఈ తిప్పలు ఉండేవి కావని కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్నిరకాల పింఛన్లు కలిపి 2,27,755 మంది పింఛను పొందుతున్నారు.

విశాఖపట్టణం పంపిస్తున్నారు..

వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులు ఎంతో ఓపికగా ఉన్నప్పటికీ వారికి కొన్ని రకాల పరీక్షలు చేసి నిర్ధారణ చేసే క్రమంలో విశాఖపట్టణంలోని సెంటర్‌కు రిఫర్ చేశారు. దీంతో విశాఖపట్టణం వెళ్లిన దివ్యాంగులకు అక్కడి సిబ్బంది ఇప్పుడు కాదు మరలా పదిరోజుల తరువాత రమ్మని పంపిస్తుండడంతో ఈసురోమంటూ తిరిగిరావాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇలా పింఛను వెరిఫికేషన్ శిబిరం దివ్యాంగుల సహనాన్ని పరీక్షించే మాదిరిగా మారింది.

వెరిఫికేషన్ పేరుతో ఇబ్బందులు



పింఛను వెరిఫికేషన్ శిబిరాలకు వచ్చిన దివ్యాంగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్ పనిచేయడం లేదంటూ వారిని రోజుల తరబడి తిప్పుతున్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం కనీసం ఏ సౌకర్యం కల్పించకుండా వాటర్ ప్యాకెట్లు మాత్రమే ఇవ్వడం ఎంతవరకు సమంజసం. 25 సంవత్సరాలకు పైగా పింఛను తీసుకుంటున్న వారి వెరిఫికేషన్‌కు కూడా విశాఖపట్టణం పంపించి పరీక్షలు చేయిస్తున్నారంటే కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై ఎంత కుట్రచేస్తుందో అర్థమవుతోంది.

– బుడితి సుజన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షుడు

రూ.13.38 లక్షల చోరీ సొత్తు స్వాధీనం


భీమవరంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: జిల్లాలో వివిధ దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.13.38 లక్షల విలువైన బంగారు ఆరభణాలు, అయిదు మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వివరాలు వెల్లడించారు. కాళ్ల మండలం సీసలి గ్రామంలో ముగ్గళ్ల నర్సింహరావు ఇంటిలో దొంగతనం చేసిన అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంకు చెందిన జొన్నల వెంకటేష్, కాళ్ల మండలం బొండాడపేటకు చెందిన ఆకురాతి జోష్ణదేవితోపాటు భీమవరం పట్టణంలోని అట్టిక గోల్డ్ కంపెనీలో పనిచేస్తున్న పాలకొల్లుకు చెందిన గొర్రెల కృష్ణలను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులను ఆకివీడు సీఐ వి జగదీశ్వరరావు, ఎస్సై నాళం శ్రీనివాసరావు విచారించగా జొన్నల వెంకటేష్, ఆకురాతి జోష్ణదేవిలపై ఉండి, పెంటపాడు, తణుకు రూరల్, తాడేపల్లిగూడెం రూరల్, లక్కవరం, తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల ప్రాంతంలో బంగారు గొలుసుల దొంగతనం, కాళ్ల ఉండ్రాజవరం, ముదినేపల్లి పరిధిలో మోటారు సైకిళ్ల చోరీల కేసులు నమోదయ్యాయన్నారు. జొన్నల వెంకటేష్ ఆటోలు, బస్సులు కోసం వేచిఉన్న ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని వారికి మోటారు సైకిల్‌పై లిఫ్ట్ ఇచ్చి వారి మెడలోని బంగారు ఆభణాలు దొంగిలిస్తాడని, అలాగే పొలాల్లో ఉన్న మహిళల మెడలోని బంగారు ఆభరణాలు లాక్కుంటాడని ఎస్పీ తెలిపారు. నిందితులు వెంకటేష్ బ్యాంక్ ఖాతాలోని రూ.78 వేలు, జోష్ణదేవి ఖాతాలోని రూ.1.80 లక్షలు సీజ్ చేసినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వివరించారు. ఈసందర్భంగా కేసును ఛేదించిన సీఐ జగదీశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లను అభినందించి నగదు రివార్డులను అందించారు. విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, సీఐ జగదీశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు ఉత్సవ కమిటీ మొదటి సమావేశం

పోలవరం రూరల్: పట్టిసం శ్రీవీరేశ్వరస్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 25 నుంచి 27వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎంవీ రమణ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లపై ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు పట్టిసం గ్రామ సచివాలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవ కమిటీ మొదటి సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాగా ఏటా ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లపై నెలరోజుల ముందు నుంచి అధికార యంత్రాగం కసరత్తు చేసేది. ఈ క్రమంలో రెండురోజుల క్రితం జరగాల్సిన మొదటి సమాశేశాన్ని ఎట్టకేలకు బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

పట్టిసం ఫెర్రీని పరిశీలించిన డీఎస్పీ

మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లపై డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఆయన పట్టిసం ఫెర్రీలో భక్తులు నది దాటి వెళ్లి వచ్చే విధంగా చేసే ర్యాంపు ఏర్పాట్లు, పంట్లు పెట్టే ప్రదేశం, గోదావరి నది, ఇసుక తిన్నెల పరిస్థితులను పరిశీలించారు. అధికారుల సమన్వయంతో పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకూడదని సిబ్బందికి ఆదేశించారు. ఏర్పాట్లపై దేవస్థానం ఈవో చాగంటి సురేష్‌నాయుడితో చర్చించారు. ఈయన వెంట పోలవరం సీఐ బాల సురేష్, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, ఫెర్రీ కాంట్రాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంపై బాధితుల ఆందోళన


పాలకొల్లులో ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద మృతుని బంధువుల ఆందోళన

పాలకొల్లు అర్బన్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే సున్నపు ప్రభాకర్ ప్రాణాలు పోగొట్టుకున్నాడని అతని బంధువులు మంగళవారం ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. నరసాపురం రాయిపేట పరిధిలోని దేవునితోటకు చెందిన సున్నపు ప్రభాకర్ పెయింటింగ్ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ప్రస్తుతం గర్భిణి. ప్రభాకర్ 9 రోజుల క్రితం అనారోగ్యంతో పాలకొల్లులోని వీరహనుమాన్ ఏరియాలో గల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. అతను గుండె, కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నట్లు డాక్టర్లు నిర్ధారించి వైద్యం చేశారని సమాచారం. ప్రభాకర్ ఆరోగ్యం విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో రాయిపేటకు చెందిన ప్రభాకర్ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రభాకర్ మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఆసుపత్రి యాజమాన్యం స్పందించి మృతుని పిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పట్టణ ఎస్సై జి.పృథ్వీ, ఏఎస్సై శివాజీ, పోలీస్ సిబ్బంది ఆందోళనకారులతో మాట్లాడారు. ఆసుపత్రి వద్ద ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి టోకరా

ఏలూరు టౌన్: ఏలూరు శివారు వట్లూరు ప్రాంతానికి చెందిన ఒక రిటైర్డ్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు భయభ్రాంతులకు గురిచేసి భారీగా డబ్బులు కాజేశారు. గతంలో భూగర్భ గనులు, ఖనిజాల శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన నత్తా రంగారావు (67) ఏలూరు సమీపంలోని వట్లూరులో నివాసం ఉంటున్నారు. ఈనెల 21న అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి తాము బెంగుళూరు పోలీసు అధికారులమని చెప్పాడు. ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసగించిన కేసులో మీదే కీలక పాత్ర అని తెలిసిందని, ఇప్పటికిప్పుడే డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, ఈకేసు నుంచి తప్పించాలంటే తాము చెప్పిన ఖాతాకు రూ.20 లక్షలు వేయాలని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో రంగారావు వెంటనే సొమ్ములను వారు చెప్పిన ఖాతాకు వేశారు. ఆ తరువాత మోసపోయానని గ్రహించి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

పాలకోడేరు: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మంతెన రవివర్మ తెలిపారు. గొల్లలకోడేరుకు చెందిన కాసాని సత్యనారాయణ మనవడు నానిబాబు (20) పాలకోడేరుకు చెందిన కోలా గౌరీని నెల రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈనెల 24వ తేదీన భార్య గౌరితో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడని, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా

26 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు



తణుకులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రమేష్‌చంద్రబాబు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందజేశారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో హాజరైన 26 మందికి సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలు అందచేసి, వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లు, నడక, వ్యాయామం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బీపీ, సుగర్ వైద్యపరీక్షలు చేసి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

కొమ్ముగూడెంలో ఉచిత కంటి వైద్య శిబిరం



కొమ్ముగూడెం గ్రామంలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో 100 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 50 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేయగా, మరో 10 మందికి కంటి ఆపరేషన్లు అవసరంగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి బేబి, టి.శ్రీను, నల్లూరి శ్రీనివాసరావు, మానవత అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఆంజనేయ స్వామి, కోశాధికారి బంగారు రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చాలి



ఇళ్ల స్థలాలు కోసం దరఖాస్తులు రాస్తున్న సీపీఐ నాయకులు, మహిళా సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదలకు ఇల్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వ హామీని అమలు చేసి వారికి సొంతింటి కలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కడకట్ల 28వ వార్డులో ఇళ్ల స్థలాల అర్జీలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హయాంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సమాఖ్య అధ్యక్షురాలు వడ్డాది మేరి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకి మాతృవియోగం



యలమర్తి రాజేశ్వరిదేవి

తణుకు అర్బన్: మాజీ ఎమ్మెల్యే వైటీ రాజా తల్లి యలమర్తి రాజేశ్వరిదేవి (97) కన్నుమూశారు. మంగళవారం తణుకులోని వారి స్వగృహంలో స్వర్గస్థులైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పారిశ్రామికవేత్తలు యలమర్తి నారాయణచౌదరి సతీమణి, ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ సోదరి కావడంతో టీడీపీ శ్రేణులు, పారిశ్రామికవేత్తలు భారీగా తరలివచ్చారు. ఆమె మృతి పట్ల ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ముళ్లపూడి కృష్ణారావు, మునిసిపల్ మాజీ చైర్మన్‌లు పరిమి వెంకన్నబాబు, డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, తాతపూడి మారుతీరావు తదితరులు సంతాపం తెలిపారు.

కుష్టు నివారణకు సహకరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ కుష్టు నిర్మూలన కేంద్రం వారి ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నారని, వారికి సహకరించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ భానునాయక్ తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 2 వరకు నిర్వహిస్తారన్నారు. అనుమానితులను గుర్తించి నిర్ధారించిన తర్వాత ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ప్రారంభ దశలో గుర్తిస్తే కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని, అశ్రద్ధ చేస్తే అంగ వైకల్యం సంక్రమించొచ్చన్నారు. బహుళ ఔషధ చికిత్స ద్వారా కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చని, ఈ చికిత్స పూర్తిగా ఉచితమని వివరించారు.

బేజారైన స్ట్రీట్ ఫుడ్ వ్యాపారం

- ఖాళీగా దర్శనమిస్తున్న వైనం
- గతమెంతో ఘనంగా నడిచేవంటున్న వ్యాపారులు
- ఆదుకున్న జగనన్నతోడు



తణుకు శివాలయం వీధిలో ఖాళీగా ఉన్న స్ట్రీట్ ఫుడ్ బళ్లు

తణుకు అర్బన్: ఒకప్పుడు మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండే స్ట్రీట్ ఫుడ్ వ్యాపారాలు నేడు బేరాల్లేక కునారిల్లుతున్నాయి. వ్యాపారాలు లేక చిరు వ్యాపారులు అల్లాడిపోతున్నారు. రోడ్డు పక్కన ఉండే స్ట్రీట్ ఫుడ్ బండ్లకు ఒకప్పుడు ఎంతో గిరాకీ ఉండే పరిస్థితి ఉండగా నేడు ప్రజల వద్ద డబ్బులేక తమ అవసరాలను సైతం అణచివేసుకునే పరిస్థితి తలెత్తడంతో వ్యాపారాలు ఖాళీగా మిగిలిపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. సాయంత్రం నుంచి మొదలయ్యే ఈ స్ట్రీట్ ఫుడ్ వ్యాపారాలు రాత్రి 10 దాటే వరకు విపరీతమైన రద్దీగా ఉంటూ తక్కువ ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందజేసే వెసులుబాటు ఉండేది. కానీ నేడు వ్యాపారాలు లేక చేసిన అప్పులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

తణుకులో స్ట్రీట్ ఫుడ్‌కు ప్రత్యేకం

తణుకు వంగవీటి మోహనరంగా వీధి, వేల్పూరు రోడ్డు, సజ్జాపురం శివాలయంవీధి, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డుల్లో స్ట్రీట్ ఫుడ్‌కు పెట్టింది పేరు. ఈ వీధుల్లో ముఖ్యంగా సాయంత్రం 5 గంటల నుంచి మొదలయ్యే వ్యాపారంలో భాగంగా ఫాస్ట్‌ఫుడ్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ఫ్రైడ్‌రైస్, నూడుల్స్ కోసం ఆహారప్రియులు అర్రులు చాస్తుంటారు. దీంతోపాటు పానిపూరి, చాట్, బజ్జీలు, టిఫిన్స్, చికెన్‌పకోడి వంటి ఆహారాలు నిత్యం అందుబాటులో ఉంటాయి. స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు ఎటువంటి అద్దెలు చెల్లించాల్సి ఉండకపోవడంతో వినియోగదారులకు తక్కువ ఖరీదుకే మంచి ఆహారాన్ని అందజేసేందుకు ఒకరితో ఒకరు పోటీపడుతుంటారు. ఎక్కువగా తోపుడుబండ్లతో చేసే వారు ఉండగా ఇటీవల కాలంలో మొబైల్ వ్యాన్స్ ద్వారా ఈ తరహా వ్యాపారం విస్తరించింది. అయితే రానురాను ఈ వ్యాపారాలు కూడా సన్నగిల్లడంతో చిరు వ్యాపారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

అండగా నిలబడ్డ జగనన్న తోడు..

గత జగన్ ప్రభుత్వ హయాంలో చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకంలో భాగంగా ఏడాదికి రూ.10వేలు ఇచ్చేవారు. దీంతో చిరు వ్యాపారులు తమ వ్యాపార పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లకుండా ప్రభుత్వం అందజేసిన సౌకర్యంతో వ్యాపారాలు చేసుకునేవారు. అంతేకాకుండా అర్హులైన ప్రజానీకానికి పలు పథకాల ద్వారా బ్యాంక్ ఖాతాల్లో నగదు జమచేయడంతో ప్రజల వద్ద కూడా డబ్బు మారకం జరిగేది. తమ అవసరాలు తీర్చుకునే క్రమంలో అన్ని వ్యాపారాలు సుభిక్షంగా నడిచే పరిస్థితి అప్పట్లో ఉండేది. కానీ నేడు వెయ్యి రూపాయిలు పింఛన్ పెంచి ఇవ్వడం తప్ప కూటమి ప్రభుత్వం మరే సంక్షేమం ఇప్పటివరకు ప్రజలకు అందజేయకపోవడంతో డబ్బు మారకం జరగక ముఖ్యంగా చిరు వ్యాపారులు అల్లాడిపోతున్నారు.

వ్యాపారాలు లేవు

గతంలో మాదిరిగా నేడు వ్యాపారాలు జరగడం లేదు. ఎవరిని కదిపినా డబ్బులెక్కడివి ఏం తింటాం అనే మాటే వినిపిస్తోంది. ఇదేం కాలమో గతంలో జగన్ ప్రభుత్వంలో రూ. 10వేలు జగనన్న తోడు పేరుతో డబ్బు అందేది. కానీ నేడు ఈ ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమం లేకపోవడంతో ప్రజల వద్ద డబ్బు లేకుండా పోయింది. కష్టపడి పనిచేస్తున్నా వచ్చే ఆదాయానికి అయ్యే ఖర్చులకు పొంతన లేకపోవడంతో ప్రజలు ఖర్చులు తగ్గించారు. వ్యాపారం రొటేషన్ కోసం మేము కూడా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

– కె.వెంకటేశ్వరరావు, చిరువ్యాపారి, తణుకు



తణుకు వంగవీటి మోహనరంగా వీధిలో జనంలేని స్ట్రీట్ ఫుడ్ బళ్లు



తణుకులో ఖాళీగా ఉన్న మొబైల్ టిఫిన్ సెంటర్లు

ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడులు



ఎల్. అగ్రహారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: వరిలో ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించి ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు పి. మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్. అగ్రహారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఒక ఎకరానికి దమ్ములో రెండు నుంచి మూడు బస్తాల సింగిల్ సూపర్ పాస్ఫేట్ లేదా కాంప్లెక్స్ ఎరువులను ఒక బస్తా మాత్రమే వేయాలని సూచించారు. మొదటి దఫాలో45కిలోల యూరియా లేదా 25 కిలోల ఎంవోపీ వేయాలన్నారు. రెండవ దఫా ఒక బస్తా యూరియా, మూడో దఫాలో 45 కిలోల యూరియా, 25 కిలోల ఎంవోపీ వేయాలన్నారు. మూడో దఫాలో 10:26:26, 14:35:14, 28:28:0, 20:20:0:13 వంటి ఎరువులను వేయరాదన్నారు. ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్. ప్రసాద్, మండల ఉద్యాన వన శాఖ అధికారి శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్ హామీలు గాలికి..



మాట్లాడుతున్న మామిడి దాన వరప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను గాలికివదిలేసిందని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ ఆరోపించారు. ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్ బాడీ సమావేశం, మంగళవారం సంఘ కార్యాలయంలో అధ్యక్షుడు బండి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. మామిడి దాన వర ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చిందని అందులో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అంటూ ముద్దు పేరు పెట్టి ప్రజల్ని మభ్య పెట్టి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఇంత వరకు ఆ ఊసే ఎత్తలేదని, ఏమన్నా అంటే లోటు బడ్జెట్ అనడం సరికాదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, నిరుద్యోగ భృతి, బీసీ వర్గాలకు 50 సంవత్సరాలకే పింఛన్లు, చేయూత పథకం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళలు అందరికి రూ .1500 ప్రతి నెలా ఇస్తానని చెప్పారని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, రైతు భరోసా, విద్యార్థులకు ఫీజు రియాంబర్స్ మెంట్, ఇళ్లు లేని నిరుపేదలకు పక్కా గృహాలు, హమాలీలకు, ఆటో కార్మికులకు సమగ్ర చట్టం చేస్తామని ఇలా ఎన్నో హామీలు ఇచ్చి నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. కార్మికులు రానున్న రోజుల్లో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, జమితార చంద్రశేఖర్, ఆదినారాయణ, దేవాబత్తుల రాంబాబు, నాని, టి.రాజు, చంటి, నమ్మి శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణతో అదనపు ఆదాయం



తాడేపల్లిగూడెం రూరల్: చినతాడేపల్లి గ్రామంలో ఉచిత పశువైద్యశిబిరం దృశ్యం



పెంటపాడు: ప్రత్తిపాడులో ఉచిత పశువైద్య శిబిరంలో బ్రోచర్‌లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పశు పోషణతో అదనపు ఆదాయం పొందవచ్చని, దీనికి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, ఉచిత వైద్య శిబిరాలను రైతులు, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ వి.సునీల్ కుమార్ తెలిపారు. మండలంలోని ఆరుళ్ల గ్రామంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. తొలుత శిబిరాన్ని సర్పంచ్ మాకరాజు వరలక్ష్మి ప్రారంభించారు. ఈసందర్భంగా 125 పాడి పశువులను పరీక్షించి, వైద్యం చేశారు. పశువైద్యాధికారి డాక్టర్ వి.సునీల్ కుమార్, కూటమి నాయకులు బెజవాడ శ్రీను, గూడవల్లి నాగేశ్వరరావు, చిటికెన శ్రీను, కట్టా శ్రీనివాసరాజు, నల్లి నాగముని, పంచాయతీ కార్యదర్శి వై.హరికిషోర్, పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, సువర్ణరాజు, వెంకటేష్, ప్రకాష్, పోసుబాబు, మహేష్ పాల్గొన్నారు. చినతాడేపల్లి గ్రామంలో 75 పశువులకు గర్భకోశ వ్యాధులు, చూడి పరీక్షలు నిర్వహించారు. 35 లేగ దూడలకు నట్టల నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ఉచిత పశు వైద్యశిబిరం

పెంటపాడు: పశువుల వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, పాడి దిగుబడులు అధికంగా పెంచేలా పశు వైద్యుల సూచనలు తప్పక పాటించాలని అలంపురం పశు వైద్యాధికారి డి. సంపత్‌కుమారి పేర్కొన్నారు. మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో 200 పశువులకు వైద్యపరీక్షలు చేశారు. మరి కొన్నింటికి గర్భకోశ వ్యాధులను పరీక్షించారు. రైతులకు మిక్చర్ ప్యాకెట్లు అందజేశారు. పశువుల పోషణకు సంబంధించి పట్టికను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, సతీష్, కూటమి నాయకులు వీర్ల కృష్ణ, మట్టా రాంబాబు, ఆరాద్యుల అంజి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



తణుకు ఆర్టీసీ డిపోలో డ్రైవర్లను సత్కరిస్తున్న మానవత సేవాసంస్థ సభ్యులు

తణుకు అర్బన్: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని పలువురు వక్తలు కొనియాడారు. ప్రమాదరహితంగా డ్రైవింగ్ చేసి ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేరుస్తున్న డ్రైవర్లు అభినందనీయులని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి, మానవత శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవల్లో భాగంగా మంగవారం తణుకు ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో డ్రైవర్లను మానవత ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం సురక్షితమనే భావన ప్రయాణికుల్లో ఉందని దానికి అనుగుణంగా డ్రైవర్లు కూడా నడచుకోవాలని కోరారు. అనంతరం ప్రమాదరహితంగా డ్రైవింగ్ విధులు నిర్వర్తించి మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన ఆర్టీసీ డ్రైవర్లు మాణిక్‌రెడ్డి పరమేశ్వరరావు, చిర్రా శాంసన్, పెదమూర్తి గంగరాజు, బయ్యే వెంకట నాగ సుబ్బారావు, ముత్యపల్లి మురళి వెంకట సత్య నాగ వరప్రసాద్‌లను తణుకు మానవతా సేవా సంస్థ వారు ఘనంగా సత్కరించారు. అనంతరం నర్సాపురం యర్రమిల్లి నారాయణమూర్తి కళాశాల డైరెక్టర్ హెచ్‌ఆర్‌డి చినమిల్లి శ్రీనివాసరావు డ్రైవర్‌లకు ప్రమాదాలు జరగకుండా ఉండటానికి తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అన్ని ఉద్యోగాలకంటే డ్రైవర్ ఉద్యోగం అత్యంత కష్టమైనదని అటువంటి డ్రైవర్‌లకు మానవతా సేవా సంస్థ సత్కారం చేయడం అభినందనీయమని అన్నారు. డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తణుకు మానవతా సేవా సంస్థ కార్యదర్శి బొల్లం రామ్‌కాశి, మానవత జిల్లా ప్రతిభా పురస్కారాల కమిటీ చైర్మన్ బోయపాటి రామలక్ష్మి, సభ్యులు, సూపర్‌వైజర్లు, డ్రైవర్‌లు, కండక్టర్‌లు, మెకానిక్‌లు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేఈఈ పరీక్షలు



జేఈఈ పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈ మెయిన్ నాలుగో రోజు పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం జరిగిన పరీక్షకు 220 మందికి గాను 219 మంది, సాయంత్రం జరిగిన పరీక్షకు 220 మందికి 218 మంది హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంటు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రం కో ఆర్డినేటర్ ఎన్.రాజశేఖర్, కో ఆర్డినేటర్ నటరాజ్ , సిస్టమ్స్ ఇన్‌చార్జి కొల్లా సురేష్, టీసీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీవీఆర్‌లో నెలవారీ సంగీత, నృత్య, సాహితీ సమాహారం



బీవీఆర్‌లో సంగీత విభావరి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో మంగళవారం రాత్రి నెలవారి సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం జరిగింది. అంబటి పెద వెంకటరాజు (పాలకొల్లు) వారిచే సంగీత విభావరి జరిగింది. సభా, సత్కార కార్యక్రమాలు జరిగాయి. సభాధ్యక్షుడిగా బుద్దాల వెంకట రామారావు, సభను ఎస్‌వీ రమణారావు, సభను పరిచయం సరిమామిళ్ళ పెద్దిరాజు చేశారు. గౌరవ పురస్కారం టీవీ రామకృష్ణకు, కళాసేవా పురస్కారం అంబటి పెద వెంకట్రాజుకు, ఆర్థిక సత్కారం రంగస్థల నటి పంజా రజనిలకు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, కళాకారులు, సాహితీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు అనిల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి క్లబ్ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని వాసవి క్లబ్ నూతన అధ్యక్షుడు పసుమర్తి హనుమంతరావు (అనిల్) ప్రకటించారు. స్థానిక ఏలూరురోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆడిటోరియంలో వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ 2025 సంత్సరం నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం మంగళవారం సాయంత్రం అట్టహాసంగా నిర్వహించారు. వేడుకకు వాసవి ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఓలేటి శ్రీనివాస గుప్తా హాజరయ్యారు. అధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ ఈ సంవత్సరం పొడవున ఎవరికి ఎటువంటి ఆపద వచ్చిన, ఎటువంటి సహాయం అవసరమైన వాసవి క్లబ్ ముందు వరసలో ఉంటుందని చెప్పారు. వాసవి క్లబ్ సెక్రటరీగా మండా బ్రహ్మజీ (పవన్) ట్రెజరర్‌గా ముత్త శ్రీధర్ గుప్తాలు ఎన్నిక కాగా, వాసవి వనిత క్లబ్ నూతన అధ్యక్షురాలిగా చొప్పెర్ల రుక్మిణి, సెక్రటరీగా కె.సునీత, ట్రెజరర్‌గా నున్న సత్య శ్రీ, కార్యవర్గం, డైరక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడ్డ వ్యక్తికి సేవలందిస్తున్న 108 సిబ్బంది

తణుకు అర్బన్: రోడ్డుప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన తణుకు మండలం జాతీయ రహదారి తేతలి గ్రామ కూడలిలో మంగళవారం చోటుచేసుకుంది. తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామానికి చెందిన రాపాక రమేష్ ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా తాడేపల్లిగూడెంవైపు నుంచి వస్తున్న ఐషర్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాధితుడి రెండు కాళ్లు నుజ్జునుజ్జుకావడంతో స్థానికులు అందించిన సమాచారంతో 108 వాహన సిబ్బంది తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ అధికారులకు సన్మానం



అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

అత్తిలి: ఇటీవల ఉత్తమ అధికారులుగా అవార్డులను స్వీకరించిన నలుగురు రెవెన్యూ అధికారులను రెవెన్యూ సిబ్బంది మంగళవారం అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో సన్మానించారు. ఉత్తమ అధికారిగా అవార్డును అందుకున్న తహసీల్దార్ దశికవంశీ, డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర వీఆర్వోల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజులను సత్కరించారు. కార్యక్రమంలో మండల వీర్వోల సంఘం అధ్యక్షుడు బేతు బాబులు, వీర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద అపారిశుద్ధ్యం



అలంపురం గొల్లగుంట చెరువు అంగన్‌వాడీ వద్ద అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని అలంపురం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. ప్రధానంగా గొల్లగుంట చెరువు, ఆర్‌బీకే సెంటర్‌లో ఉన్న కేంద్రం వద్ద దుర్వాసన వస్తోంది. డ్రెయినేజీల్లో తీసిన సిల్ట్‌ను తీయకపోవడంతో తరచూ చిన్నారులు రోగాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ చిన్నారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు కళాకారుల సంఘం సభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ 152వ నెలవారీ సభా కార్యక్రమం స్థానిక గీతా మందిరంలో ఈ నెల 28వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారి మాస బాబూరావు తెలిపారు. గౌరవ సత్కారం, కళా సత్కారం, ఉత్తమ ఉద్యోగ సేవా పురస్కారం, ఆర్థిక సత్కార కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. విద్యాశాఖ విశ్రాంత ఉప సంచాలకులు డాక్టర్ జె.మాలతీ మాధవ్ రచించిన వారణాసి దర్శన నిర్దేశ సూచిక గ్రంథాన్ని సభలో ఆవిష్కరిస్తారని చెప్పారు. గరగ నృత్యాల ప్రదర్శన, సంగీత విభావరి జరుగుతాయని తెలిపారు.

అతి వేగం అనర్థదాయకం

భీమవరం: విద్యార్థులు వాహనాలు నడిపే సమయంలో అతివేగం అనర్థదాయకమని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఈ సదస్సులో వాహన తనిఖీ అధికారి కేఎస్ఎన్ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై గగరిన్, తదితరులు పాల్గొన్నారు.

తణుకు జిల్లా ఆసుపత్రిలో సదరం వెరిఫికేషన్

ఇరగవరం: ఇరగవరం మండలం ప్రభుత్వ ఆదేశాల మేరకు వినికిడి సమస్యతో వికలాంగుల పింఛన్లు పొందుతున్నవారికి ఈ నెల 29వ తేదీన తణుకు జిల్లా ఆస్పత్రిలో సదరం వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇరగవరం మండలం నుంచి అర్జునుడుపాలెం 6, ఏలేటిపాడు 12, గొటేరు 8, అయినపర్రు 5, ఇరగవరం1, 2లకు సంబంధించి 16, కాకిలేరు 2 మొత్తం 49 మంది పింఛన్‌దారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

తాడేపల్లిగూడెం: గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకొనే ప్రక్రియ ప్రారంభమైందని తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. గూడెం సర్కిల్ పరిధిలో ఆయా కులాలకు నాలుగు దుకాణాలు కేటాయించారు. గూడెం మునిసిపాలిటీ పరిధిలోని దుకాణం ఒకటి గౌడ కులానికి కేటాయించగా, అత్తిలి మండలం షాపును శ్రీశయనా కులానికి, గణపవరం మండల దుకాణం గౌడ్‌లకు, గూడెం మండలం దుకాణాన్ని గౌడ కులానికి కేటాయించారు. ఈ దుకాణాలకు దరఖాస్తు చేసుకోడానికి ఫిబ్రవరి ఐదో తేదీ చివరితేదీ. ఆన్‌లైన్, హైబ్రిడ్, ఆఫ్‌లైన్ పద్ధతిలో ఈ దుకాణాల కేటాయింపునకు దరఖాస్తు రుసుంను చెల్లించవచ్చు. ఒక్కొక్క దరఖాస్తుకు రెండు లక్షల రూపాయలు చెల్లించాలి. ఒక దరఖాస్తుదారు ఎన్ని దరఖాస్తులు అయినా సమర్పించవచ్చు కాని, లాటరీలో ఏదైనా దుకాణం తగిలితే మిగిలిన దుకాణాలు పొందడానికి అర్హత ఉండదు. దరఖాస్తు రుసుం మిగిలిన దుకాణాలకు చెల్లించి తిరిగి ఇవ్వబడదు. దుకాణాల కేటాయింపునకు సబ్‌క్యాస్టు సర్టిఫికెట్‌ను సంబంధిత తహసీల్దార్ వద్ద నుంచి తీసుకొని సమర్పించాలి. ఈ దుకాణాల కేటాయింపునకు సంబంధించి లాటరీ ప్రక్రియ ఫిబ్రవరి ఏడున భీమవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగనుందని అధికారులు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయం



రీజియన్ చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. రీజియన్ చైర్‌పర్సన్ పీవీ సత్యనారాయణ గుడ్‌విల్ విజిట్‌లో భాగంగా మంగళవారం ఆయన పట్టణంలో వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, క్లబ్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్యలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురిని సత్కరించారు. జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, బండి వెంకటేశ్వరరావు, ఎల్.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీహరి విష్ణు కుమార్, చెన్నారెడ్డి సతీష్, గురుస్వామి, ఆకుల సతీష్ నాయుడు, మృత్యుంజయ కుమార్, కొత్తపలి రవికుమార్, పుట్టా విజయశ్రీ, కామేశ్వరరావు, కోడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.